# ముస్తాబైన కరుణ కోవెలలు

- రేపు క్రిస్మస్ వేడుక
- రెండు నియోజకవర్గాల్లో సందడి
- ఆరాధనతోపాటు సేవా కార్యక్రమాలు

**కపిలేశ్వరపురం:** దైవం మానవ రూపంలో దర్శనం ఇచ్చిన నాడు మొత్తం సమాజం తేజోమయం అవుతుంది. దేవుని చేయి ప్రేమతో శిరస్సును తాకి దీవించినపుడు మనస్సు నిండి మది నిండా సంతోషం వికసిస్తుంది. డిసెంబర్ 25 అనగానే ప్రేమతో దయ చూపిన దేవుడు జన్మించిన రోజు. మానవ జాతి యావత్తూ మహోన్నతమైన లక్ష్యంతో క్రిస్మస్ వేడుక జరుపుకుంటుంది. ఆ రోజు రానే వచ్చింది. కరుణ కోవెలలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని ప్రేమాలయాల్లో వేడుకకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 25న క్రిస్మస్ సందర్భంగా ఈ కథనం...

**క్రీస్తు ఆరాధనలో దైవజనులు**

ప్రపంచ శాంతి మార్గాన పయనించేందుకు ఏసు బోధనలు దోహదం చేస్తాయి. బైబిల్ వాక్యాలను అధ్యయనం చేసిన నాడు మానవ జన్మ పరమార్థం అర్థం కాగలదు. ఆధునిక కాలంలో సైతం ప్రేమాలయాల చెంత ఆరాధనలో భక్తులు తేలియాడుతున్నారు. కరుణ గల ఏసు ఏలుబడిలో జీవిస్తున్నారు. ఆధునిక జీవన స్థితిగతుల నేపథ్యంలో క్రీస్తు బోధనల ఆవశ్యకత మరింత పెరిగింది. సాటి మనిషి పట్ల, జీవకోటి పట్ల ప్రేమను కలిగి ఉండాల్సిన అవసరాన్ని బైబిల్ నొక్కి చెబుతుంది. ఏసు క్రీస్తు చూపిన శాంతి మార్గంలో ముందుకు సాగడమే క్రిస్మస్ సందేశం.

**ఇవీ ప్రధాన చర్చిలు**

మండపేట పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి, న్యూలైఫ్ బాప్టిస్ట్ చర్చి, సెయింట్ మేరీస్ బాప్టిస్ట్ చర్చి, మండపేట మండలంలోని కేశవరం ట్రినిటీ లూథరన్ చర్చి, మండల కేంద్రమైన రాయవరం అపోస్థలిక్ ప్రేయర్ హౌస్, కపిలేశ్వరపురం మండలం అంగర, టేకి, కపిలేశ్వరపురం, వెదురుమూడి, మాచర గ్రామాల్లోని చర్చిల్లో ఏటా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రామచంద్రపురం మండలంలోని కోటపేటలోని న్యూలైఫ్ షాలోమ్ బాప్టిస్ట్ చర్చి, తోటపేటలోని రోమన్ కేథలిక్ చర్చి, ఏసు ప్రేమాలయం, ద్రాక్షారామలోని గుడ్‌న్యూస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలోని చర్చి, ఆదివారపుపేటలోని రాక్ చర్చి, కె.గంగవరం మండలంలోని అముజూరు మన్నా చర్చి, కాజులూరు మండలంలో గొల్లపాలెం చర్చిలలో క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు చేశారు.


మాచర చర్చి వద్ద పశువులపాక సెట్టింగ్

**సేవ, సాంస్కృతిక కార్యకలాపాలకు వేదిక**

క్రిస్మస్ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఆ రోజంతా క్రైస్తవ భక్తులు చర్చి చెంతనే గడుపుతారు. ఆరాధనతో పాటు సాంస్కృతిక కార్యకలాపాల్లో తలమునకలవుతారు. బైబిల్‌లోని ఘట్టాలను కళారూపాలుగా ప్రదర్శిస్తారు. ఏసు జీవితాన్ని కీర్తిస్తూ గీతాలు ఆలపిస్తారు. చిన్నారులు క్రిస్మస్ తాత, మహిళలు మరియమ్మ వేషధారణలో అలరిస్తారు. ఇప్పటికే చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ ట్రీ, ఏసు పుట్టిన ఘట్టాన్ని తెలిజేసే పశువుల పాక సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. మండపేట, రామచంద్రపురం పట్టణాల్లోని చర్చిలు, ప్రధాన కూడళ్లలో స్టార్‌లను ప్రదర్శిస్తున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో నియోజకవర్గ స్థాయి, మండలాల స్థాయి పాస్టర్స్ ఫెల్లో షిప్ పేరుతో సంఘాలుగా పాస్టర్లు ఐక్యమయ్యారు. ఫెల్లోషిప్‌ల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు, యువకులు, మహిళలు, శ్రామికులకు పలు విధాలుగా చేయూత ఇస్తున్నారు. వాటితోపాటు క్షేత్ర స్థాయిలోని చర్చి నిర్వాహకులు సైతం సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.


కేశవరం ట్రినిటీ లూథరన్ చర్చిలో గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు (ఫైల్)


మాచర చర్చి వద్ద విద్యుత్ అలంకరణలో క్రిస్మస్ ట్రీ


విద్యుత్ అలంకరణలో
టేకిలోని జోసెఫ్ వీరవల్లి బాప్టిస్ట్ చర్చి

## హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం


ఆర్యావటం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్

**కాజులూరు:** ఎన్నికల నాటి హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. కరెంటు బిల్లులు పెరుగుదలను నిరసిస్తూ ఈనెల 27న జరగనున్న మహా ధర్నాని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ఆర్యావటంలో సూర్యప్రకాశ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు కరెంటు బిల్లులు తగ్గిస్తామని ఎన్నికల్లో హామీలిచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు తిరగకుండానే చార్జీలు పెంచి రాష్ట్ర ప్రజలపై 15,485.36 కోట్లు భారం మోపి మోసం చేశారన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు నియోజకవర్గ కేంద్రమైన రామచంద్రపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మహా ధర్నా జరుగనుందన్నారు. మండల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

## దశావతారాల మహోత్సవాల ప్రారంభం

**రాయవరం:** స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో దశావతార మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.ఏటా మాదిరిగానే వైఖానస ఆగమ విధానంలో ఉత్సవాలు ప్రారంభించారు. వైఖానస ఆగమ ప్రవర అంగర అయ్యామాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు పెద్దింటి శేషాచార్యులు, పెరవలి కృష్ణమాచార్యులు, అంగర జనార్దనాచార్యులు, పెద్దింటి వెంకటాచార్యులు, అంగర శోభనాద్రాచార్యుల పర్యవేక్షణలో 10 మంది వేద పండితులు శ్రీవారికి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, వస్త్ర సమర్పణ, అకల్మష హోమం నిర్వహించి స్వామివారిని వటపత్ర సాయి అవతారంలో అలంకరించారు. మధ్యాహ్నం స్వామి వారికి సంప్రోక్షణ, అలంకార, తిరుమంజన సేవలు, అంకురార్పణ, ధ్వజారోహణ తదితర పూజలు నిర్వహించి మత్స్యావతారంలో స్వామి వారిని అలంకరించి, అలంకార తిరుమంజనం, సకల దోష నివారణార్థం అకల్మష హోమం నిర్వహించారు. రాయవరం పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దశావతార మహోత్సవాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


రాయవరంలో వటపత్ర సాయి, మత్స్యావతార అలంకారంలో శ్రీ, భూ సమేత శ్రీవారికి పూజలు

## సూర్య ఘర్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

**రామచంద్రపురం రూరల్:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని ద్రాక్షారామ గ్రామ పంచాయతీలో సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ యోజన పథకానికి కేంద్ర ప్రభుత్వం భారీగా రాయితీలను కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ రాయితీని వినియోగించుకుని రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని కరెంటు బిల్లుల నుంచి విముక్తి పొందాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ కోనసీమ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.రాజబాబు, రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు, డీఈ కంచుమర్తి మురళీమోహన్, ఏఈ మేడిశెట్టి వెంకటరమణ, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అర్తమూరులో నేడు పీఎం సూర్యఘర్ యోజన గ్రామసభ

**మండపేట:** ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనపై మండలంలోని అర్తమూరులో మంగళవారం గ్రామసభ నిర్వహించనున్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజల విద్యుత్ చార్జీలు పొదుపునకు, నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ఈ పథకం ద్వారా సోలార్ సిస్టంను పరిచయం చేస్తున్నారు. సూర్యఘర్ యోజన మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు విద్యుత్‌శాఖ అధికారులు అర్తమూరు గ్రామాన్ని ఎంచుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని నల్లమిల్లి సుగుణావతి లలితా కళామందిర్‌లో గ్రామసభభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యాబోధన

- ఉన్నత విద్యారంగానికి బడ్జెట్లో రూ.2,326 కోట్లు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాముఖ్యతనిస్తూ, ఉన్నత విద్యకు బడ్జెట్లో రూ.2,326 కోట్లు కేటాయించిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పట్టణంలో చింతపల్లి సూరన్న నగర్‌లో ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌ను మంత్రి సుభాష్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మంత్రి సుభాష్ హైస్కూల్ ప్రాంగణాన్ని నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పరిశీలించి, ఆహారాన్ని తిని రుచి చూశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యాబోధన ఉండాలని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్నారు. ముఖ్యంగా హైస్కూల్లో పచ్చదనం, పరిశుభ్రత, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యార్థులకు సత్ప్రవర్తన, మంచి అలవాట్లు వచ్చేలా ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్ట్ వారి తల్లిదండ్రులకు తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణానికి, వంటశాల ఆధునీకరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యా సంవత్సరంలో 75% హాజరు ఉన్న విద్యార్థులకు తల్లికి వందనం పథకం త్వరలో అమలవుతుందని అన్నారు. పలువురు విద్యార్థులను మంత్రి సుభాష్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యాపరంగా ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు.


మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న మంత్రి సుభాష్

## పరుగుపందెం విజేతకు పీహెచ్‌సీ సిబ్బంది అభినందనలు

**కాజులూరు:** రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో పాల్గొని పరుగుపందెంలో మూడు బంగారు పతకాలు సాధించిన యాతం నాగబాబును గొల్లపాలెం, దుగ్గుదుర్రు పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. వైద్య, ఆరోగ్యశాఖలో జిల్లా మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారిగా పనిచేస్తున్న యాతం నాగబాబు ఈ నెల 14 నుంచి 15 వరకూ కృష్ణా జిల్లా ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన 44వ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 2024 పరుగుపందెం పోటీల్లో పాల్గొని 200, 400, 800 మీటర్ల విభాగాలు మూడింటిలోనూ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలను సాధించారు. గొల్లపాలెం పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ సౌజన్య, దుగ్గుదుర్రు పీహెచ్‌సీలో వైద్యాధికారి ఎస్ ఫణితేజల ఆధ్వర్యంలో సిబ్బంది యాతం నాగబాబుకు అభినందన సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది వైకుంఠరావు, హెచ్ఎస్ సాల్మన్‌రాజు, ఇమ్మంది లక్ష్మీప్రసన్న, నరాళ రాజారావు పాల్గొన్నారు.


అథ్లెటిక్స్ విజేత యాతం నాగబాబును సత్కరిస్తున్న గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది

## కాటన్ కీర్తి ప్రతిష్టలు ఎన్నటికీ మరువలేనివి

**కాజులూరు:** ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపరభగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని కీర్తి ప్రతిష్టలు ఎన్నటికీ వెలకట్టలేనివని డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు, స్థానికులు సోమవారం అంతర్జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దుగ్గుదుర్రులో అమలాపురం పార్లమెంటరీ శెట్టిబలిజ సంఘం కన్వీనర్ కడలి రాంపడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


దుగ్గుదుర్రులో కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రైతు సంఘాల నాయకులు

## అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన

**రాయవరం:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమాన పరిచేలా కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం మండలంలోని చెల్లూరులో ధర్నా చేశారు. సీఐటీయూ మండల శాఖ అధ్యక్షురాలు డి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడిన అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ సభ్యులు సీహెచ్ సత్యవేణి, ఎం.కమల, డి.చంద్రకుమారి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.


చెల్లూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, సభ్యులు

## క్లుప్తంగా

### విద్యార్థులకు అభినందనలు


విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

**రామచంద్రపురం:** జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా వేళంగి మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్విజ్, మోనో యాక్షన్, మోడల్ ప్రదర్శనల్లో భాష్యం విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపల్ భాస్కరరావు సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ పోటీలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పాల్గొన్న 400 మంది విద్యార్థులు పాల్గొనగా స్థానిక భాష్యం విద్యార్థులు గౌతమ్ జూనియర్స్ విభాగంలోను, జస్మిత, క్రిస్టీ జోయిల్‌లు సీనియర్స్ విభాగాల్లో ద్వితీయ బహుమతులను గెలుపొందారని తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపాల్ గోవిందరాజు, గెలుపొందిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

### 26న మండల సర్వ సభ్య సమావేశం

**కె.గంగవరం:** ఈ నెల 26న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఈ సమావేశంలో బడ్జెట్ ఆమోదంతో పాటు పలు అంశాల ఆమోదం కోసం చర్చ జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామ స్థాయి నివేదికతో హాజరు కావాలని ఆయన కోరారు.

### డీసీ కమిటీ అధ్యక్షుడు నల్లమిల్లికి సత్కారం

**రాయవరం:** రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన నల్లమిల్లి సత్యనారాయణరెడ్డిని సోమవారం మండలంలోని పసలపూడిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి డీసీ అధ్యక్షుడిగా ఎంపిక కావడం పట్ల మాజీ జెడ్పీటీసీ కృష్ణ, మాజీ సర్పంచ్ బొడబళ్ల అప్పలస్వామి, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకన్నబాబు, టీడీపీ నాయకులు కొవ్వూరి సుధాకర్‌రెడ్డి, మల్లిడి సూరారెడ్డి, అనుసూరి శ్రీనివాసరావు తదితరులు సత్యనారాయణరెడ్డిని సత్కరించారు.

### ఆలయ అభివృద్ధికి మంత్రి విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు
చెక్కు అందిస్తున్న మంత్రి సుభాష్

**కె.గంగవరం:** మండలంలోని కూళ్ల ఏటిగట్టుపై కొలువైన ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ విరాళం అందించారు. రామచంద్రపురంలోని పార్టీ కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులకు ఆలయ అభివృద్ధి కోసం రూ.లక్ష చెక్కు అందించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం పాటు ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని కమిటీ సభ్యులకు మంత్రి సూచించారు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**రామచంద్రపురం రూరల్:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఆవిష్కరించారు. క్యాలెండర్ ఆవిష్కరణ నిమిత్తం ఆలయానికి విచ్చేసిన మంత్రి సుభాష్‌కు ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి సుభాష్ భీమేశ్వర స్వామిని, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం 2025 సంవత్సర నూతన క్యాలెండర్‌ను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి నాయకులు, ఆలయ అర్చకులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు. పాల్గొన్నారు.

### భవన నిర్మాణానికి చర్యలు

**కొత్తపేట:** స్థానికంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న బ్లడ్ బ్యాంక్ స్టోరేజ్ భవన నిర్మాణానికి తమ పరిధిలో తగు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో పి.శ్రీకర్ హామీ ఇచ్చారు. ఇప్పటికే బ్లడ్ బ్యాంక్ స్థల సేకరణ జరిగి నిధులు మంజూరు కాగా భవన నిర్మాణానికి సహకారం అందించవలసిందిగా ఆర్డీవోను జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నారాయణరావు ఆధ్వర్యంలో సభ్యులు కోరారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవోను కలసిన వారు దాతల సహకారంతో బ్లడ్ బ్యాంక్ స్టోరేజీ భవన నిర్మాణం తలపెట్టగా ప్రభుత్వ నిధులు మంజూరు చేసినట్టు ఆర్డీవోకు వివరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కొత్తపేట, రామచంద్రపురం డివిజన్ ఇన్‌చార్జ్ సత్తిరాజు ఆదిత్య కిరణ్ పాల్గొన్నారు.

### ఘనంగా మాజీ మంత్రి వేణు జన్మదిన వేడుకలు


మాజీ మంత్రి వేణుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న నేతలు

**రామచంద్రపురం:** మాజీ మంత్రి, తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కౌన్సిలర్లు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు, ఇతర పార్టీ నేతలు వేణుకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచారు.

### దివ్యాంగునికి లయన్స్ క్లబ్ ట్రై సైకిల్ బహూకరణ


దివ్యాంగుడు పరమేశ్వరరావుకు ట్రై సైకిల్ బహూకరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

**మండపేట:** సేవా కార్యక్రమాల ద్వారా పలువురికి సహాయ పడడంలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ఎప్పుడూ ముందువరుసలో ఉంటుందని మండపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిలుకూరి బాపిరాజు అన్నారు. పట్టణానికి చెందిన దివ్యాంగుడు అయినవిల్లి పరమేశ్వరరావుకు రూ.పది వేల విలువైన ట్రై సైకిల్‌ను లయన్స్ క్లబ్ సోమవారం బహూకరించింది. సత్యశ్రీ రోడ్డులోని లయన్స్ క్లబ్ భవనం వద్ద క్లబ్ అధ్యక్షుడు బాపిరాజు చేతుల మీదుగా క్లబ్ సభ్యుల సమక్షంలో ట్రై సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో లయన్ నాగేంద్రబాబు, క్లబ్ కార్యదర్శి చెన్నా రాంబాబు (రాంపండు), కోశాధికారి గుండు తాతరాజు, లయన్స్ కాళ్ల బాబు, కురసాల సత్యనారాయణ, ప్రసాద్, అబ్బాస్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### మాచవరం హైస్కూల్లో గణిత దినోత్సవం


రామానుజన్ చిత్రపటం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

**రాయవరం:** జాతీయ గణిత దినోత్సవాన్ని సోమవారం మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగవల్లుల పోటీల్లో పాల్గొన్నారు. రామానుజన్ ఆకృతిలో నేచురల్ మెటీరియల్స్ అయిన ముగ్గు, నల్ల కంకర రాళ్లు, పచ్చగడ్డి, ఇటుకపొడి తదితర వస్తువులతో రామానుజన్ చిత్ర పటాన్ని రూపొందించారు. రామానుజన్ చిత్రపటం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులకు గణితానికి సంబంధించి వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించగా, విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రాయవరం ఎస్సైగా సురేష్‌బాబు



**రాయవరం:** రాయవరం పోలీసుస్టేషన్ హౌస్ అధికారిగా డి.సురేష్ బాబు నియమితులయ్యారు. ప్రస్తుతం రాయవరం ఎస్సైగా ఉన్న పి.బుజ్జిబాబును మండపేట రూరల్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆరునెలలు పూర్తి కాకుండానే ఎస్సై బుజ్జిబాబు బదిలీ కావడం వెనక కారణాలు ఏమై ఉంటాయా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని కొత్త ఎస్సై సురేష్ బాబు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు, జూదం, అక్రమ మద్యంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు.

### భూ యాజమాన్య హక్కుల రక్షణే ధ్యేయం


కపిలేశ్వరపురంలో ర్యాలీ చేస్తున్న తహసీల్దార్ తదితరులు

**కపిలేశ్వరపురం:** భూమిపై యజమానుల హక్కులను పరిరక్షించడమే లక్ష్యంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై కపిలేశ్వరపురంలో సోమవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో భూహక్కులపై తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించమంటూ భూ యాజమానుల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించారు. సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను తహసీల్దార్ ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ సారథ్యంలో రెవెన్యూ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.